క్లుప్తంగా

ఆపదలో ఉన్న వారిని ఆదుకోండి

మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి



శంకరయ్యకు ఆర్థిక సహాయం అందిస్తున్న గోపాల్‌రెడ్డి

చేవెళ్ల: ప్రతిఒక్కరూ ఆపదలో ఉన్న వారిని అదుకోవాలని పామెన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని పామెన గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో లాండ్రి షాపు కాలిపోయిన విషయం తెలుసుకొని బాధితుడు శంకరయ్యను మాజీ సర్పంచ్ డి గోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాండ్రి షాపుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చాకలి శంకరయ్య షాపు కాలిపోయి తీవ్రంగా నష్టపోయాడని తెలిపారు. ఈ విషయంలో జరిగిన ప్రమాదం తెలుసుకొని బాధితున్ని గోపాల్‌రెడ్డి ధైర్యం చెప్పారు. అతనికి అండగా ఉంటామని బరోసా కల్పించారు. అనంతరం అతనికి సహాయంగా రూ.10వేలను గోపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగోపాల్, డి.చంద్రారెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గండిపేట్ చౌరస్తా చెక్‌పోస్టు స్టాటిక్ సర్వేలివాస్ టీమ్ ఇన్‌చార్జి గోపాల్



కారును తనిఖీ చేస్తున్న గోపాల్, పోలీస్ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని గండిపేట్ చౌరస్తా చెక్‌పోస్టు స్టాటిక్ సర్వేలివాస్ టీమ్ (ఎస్ఎస్‌టి) ఇన్‌చార్జి గోపాల్ పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని గండిపేట్ చౌరస్తాలో ఆయన పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలకు వాహనాదారులు సహకరించాలని కోరారు. ఈ విషయంలో పోలీస్ సిబ్బందికి సహకరించి తమతమ వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపించాలన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా డబ్బులు, ఇతర వస్తువులు రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కష్టపడే వారిని పార్టీ గుర్తిస్తుంది



మల్లారెడ్డిని సన్మానిస్తున్న మాణిక్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కష్టపడి పని చేసే వారిని పార్టీ గుర్తిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా మాడి మల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అతన్ని మాణిక్‌రెడ్డి పూలమాల వేసి సన్మానించారు. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌గోపాల్ చారి, పెద్ది పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ముంజగళ్ల మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దు

సామాజిక విప్లవ రణభేరి ఎస్సీ పోరాట వేదిక

ఇబ్రహీంపట్నం: నోటుకు ఓటు అమ్ముకోవద్దని జైభారత్ చేస్తున్న ఉద్యమం అభినందనీయమని సామాజిక విప్లవ రణభేరి ఎస్సీ పోరాట వేదిక కమిటీ సభ్యులు నర్సింగ్ అన్నారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానమంటూ ప్రచురించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు చూపే డబ్బు ఎరకు ఆశపడితే...మరో ఐదేళ్ల పాటు మోసపోవడం ఖాయమన్నారు. పార్టీల కతీతంగా అభ్యర్థుల ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థతను పరిగణలోకి తీసుకొని ఓటు వేయాలన్నారు. జైభారత్ ఆధ్వర్యంలో అణగారిన వర్గాలను చైతన్యం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా జస్ట్ ఓట్ క్యాంపెయిన్ చేపట్టడం అభినందనీయమన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత, నర్సింగ్ గోపి, సాత్విక్, నరేందర్, ఆంజనేయులు, కార్తీక్ పాల్గొన్నారు.

ఆ రోడ్డంతా చెత్తే..!

- పరిశుభ్రత లోపిస్తున్న కాలనీలు
- కంపు కొడుతున్నా పట్టించుకోరూ
- ముస్తాఫాహిల్స్ కాలనీ వాసుల ఆవేదన
- తక్షణమే చర్యలు చేపట్టాలని మొర



ముస్తాఫాహిల్స్ కాలనీకి వెళ్లే రోడ్డుపై పేరుకపోతున్న చెత్తా, చెదారం

మొయినాబాద్: మొయినాబాద్ అంటే పచ్చని చెట్లు, పచ్చదనంతో కూడుకున్న పరిసరాలు, గార్డెన్లు, అహ్లాదకరమైన వాతావరణం ఫాంహౌస్‌లు, పంటపొలాలతో కళకళలాడుతుంటుంది. ఇలాంటి చోటా కాలనీలు అపరిశుభ్రంగా మారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మొయినాబాద్‌లోని ముస్తాఫాహిల్స్ కాలనీ దుస్థితి ఘోరంగా తయారైంది. చెత్తతో నిండి కంపు కొడుతున్న పట్టించుకునే వారు లేరు. మొయినాబాద్ మండల కేంద్రం విస్తరించడంతో ఐదేళ్ల క్రితం ముస్తాఫాహిల్స్ కాలనీ ఏర్పడింది. మొయినాబాద్‌లో డంపింగ్ యార్డుకు ప్రభుత్వం స్థలం కేటాయించకపోవడంతో ముస్తాఫాహిల్స్ కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గత కొన్నేళ్లుగా ఇక్కడ చెత్తను డంప్ చేస్తున్నారు. మొయినాబాద్‌లో ప్రతీరోజు సుమారు పది ట్రాక్టర్ల చెత్తను ఇళ్ల నుంచి సేకరించి ఖాళీ స్థలంలో పారబోస్తున్నారు. దానికి తోడు మండల కేంద్రంలోని చికెన్ సెంటర్లు, హోటళ్లలో వెలువడే వ్యర్థాలను సైతం ఖాళీ స్థలంలోనే వేస్తుండడంతో అక్కడ పెద్ద డంపింగ్ యార్డులా తయారైంది. ఆ రోడ్డు గుండా వెళ్తుంటే విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుంది. ముస్తాఫాహిల్స్ కాలనీ పక్కనే చెత్త డంపింగ్ చేస్తుండడంతో కాలనీ మొత్తం దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో అక్కడ ఈగలు, దోమలు చేరి రోగాలు ప్రబలే అవకాశం లేకపోలేదని కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు పక్కనే చెత్త, వ్యర్థపదార్థాలు వేస్తుండడంతో పశువులు, కుక్కలు వచ్చి వాటిని రోడ్డుపైకి లాక్కెళ్లి నడకబాటలోనే వదిలేస్తున్నాయి. చెత్తలో ఉండే ప్లాస్టిక్ కవర్లను పశువులు తిని అనారోగ్యానికి గురవుతున్నాయని చెబుతున్నారు. ఇక్కడ చెత్త చేరడంతో జ్వరం, దగ్గు, వంటి వ్యాధుల బారిన జనం పడుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ జోనల్ స్థాయి ఎంపిక



మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ

మొయినాబాద్‌రూరల్: రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో నిర్వహించబోయే ఫరేడ్ కోసం ఎన్ఎస్ఎస్ జోనల్ స్థాయి సెలక్షన్స్‌ను కేఎల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నామని రీజినల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ ఏపీ అధికారి పి.అశోక్‌రెడ్డిలు తెలిపారు. అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవం సదర్భంగా ఫరేడ్ నిర్వహించేందుకు జోనల్ స్థాయి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో తెలంగాణ, ఏపీకి చెందిన ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జాతీయ గౌరవాన్ని నిలబెట్టడంలో, సమాజ సేవ చేయడంలో ఎన్ఎస్ఎస్ ముందుంటుందన్నారు. ఏడు రాష్ట్రాల నుంచి 200 మంది బాలికలు ఏపీ, డామన్, డయ్యూ, దాద్రానగర్ హవేలి, గోవా, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీ నిర్వాహకులు ప్రణాళిక బద్ధంగా అభ్యర్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఛాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు, డీన్ డాక్టర్ సిహెచ్ హన్మంత్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పి శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు అనుమతి ఎందుకివ్వరు

- 111 జీఓ ఎత్తేసి 69 తీసుకొచ్చారు
- విధి విధానాలు చెప్పని ప్రభుత్వం
- కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేబుల్ రాజు

మొయినాబాద్: ప్రభుత్వం 111 జీఓను ఎత్తేస్తే ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి ఎందుకివ్వడంలేదని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేబుల్ రాజు ప్రశ్నించారు. శుక్రవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో 111 జీఓను ఎత్తేశారని చెప్పడాన్ని తప్పుబట్టారు. ఈ జీఓ పూర్తి స్థాయిలో ఎందుకు అమలు కావడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బీఆర్ఎస్ ఈ జీఓ అంశాన్ని వాడుకుంటుందన్నారు. 111 జీఓ ఎత్తేసి 69 తీసుకొచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు ఈ జీవో విధివిధానాలు తెలియజేయలేదన్నారు. ఇటీవల 111 జీఓ నిబంధనలు యథావిధిగా కొనసాగుతున్నాయని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ జీఓ పరిధిలోని 84 గ్రామాల్లో కొత్త నిర్మాణాలకు అనుమతి ఇవ్వడంలేదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు ఈ జీఓ విషయంలో ప్రజలను, రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

తాయిలాలు ప్రకటిస్తే నమ్మొద్దు

- బజరంగ్‌దళ్ విభాగ్ కో కన్వీనర్ గూడెం రమేశ్

షాబాద్: ఎన్నికల సమయంలో మైనార్టీలకు తాయిలాలు ప్రకటించే పార్టీలను ప్రజలు నమ్మొద్దని బజరంగ్‌దళ్ విభాగ్ కో–కన్వీనర్ గూడెం రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇతర మతాలకు తాయిలాలు ప్రకటిస్తున్న పార్టీలు హిందూవులను చిన్న చూపు చూస్తే విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు సహించరన్నారు. ఈ ఎన్నికల్లో ఇతర మతాలను బుజ్జగిస్తూ, హిందువుల పట్ల చిన్న చూపు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రజలందరికీ విద్యా, వైద్యం ఉచితంగా అందించే విధంగా కృషి చేయాలన్నారు. వృద్ధులకు, వికలాంగులకు చేయూతనిస్తూ, రైతులకు భరోసానిచ్చేవారికి తమ మద్దతు ఉంటుందన్నారు.

ఈతకని వెళ్లిన విద్యార్థి అదృశ్యం



ఆకాశ్ (ఫైల్)

షాబాద్: ఈతకని వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్ గ్రామానికి చెందిన సొన్నాయిల ఆకాశ్(15) పదోతరగతి చదువుతున్నాడు. ఈతకని వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు గత మూడు రోజులుగా బంధువుల వద్ద, స్నేహితుల వద్ద వెతికినా అతని ఆచూకీ లభ్యంకాలేదు. కానీ లక్ష్మరావుగూడ గ్రామ సమీపంలోని పెద్ద క్వారీ గుంత వద్ద అతని చెప్పులు, బైక్ ఉండడంతో ఈతకని వచ్చి అదృశ్యమయ్యాడని అనుమానిస్తున్నారు. రెండు రోజులుగా ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినా విద్యార్థి జాడ లభించలేదు. క్వారీ గుంతలో దూకాడా? లేదా ఎక్కడికైనా పారిపోయాడా? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. విద్యార్థి ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



మద్దూరు గ్రామంలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్‌డ్ అన్నారు. శుక్రవారం నాన్‌ంధార్‌ఖాపేట్, మద్దూరు గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు పారుడు వ్యాధి రాకుండా ఉండేందుకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు ఎటువంటి రోగాలు ప్రబలిన వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం చేరవేయాలన్నారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పీపీఓర్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఐకమత్యమే మహాబలం



మహ్మద్ ఏర్పాటు చేసిన బిక్షను స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

- అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్
- అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు

మొయినాబాద్‌రూరల్: ఐకమత్యమే మహాబలమని, సమాజంలో అందరు కలిసిమెలిసి ఉంటేనే దేశైక్యతను చాటగలమని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్ అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ గ్రామంలో అయ్యప్ప స్వాములకు గ్రామానికి చెందిన మైనార్టీ సోదరుడు మహ్మద్ బిక్ష ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా రవియాదవ్ పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అందరు కలిసిమెలిసి ఉండాలన్నారు. దేవుడు ఒక్కడే అని చెప్పారు. మతాలకను గుణంగా దేవుడిని స్మరించుకోవచ్చన్నారు. భక్తి భావంతోనే జనంలో ఐక్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు మహేందర్, మల్లేశ్‌యాదవ్, మల్లేశ్‌ముదిరాజ్, అశోక్‌చారి, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలకే దిక్కు లేదు



షాబాద్: మహిళకు కారు గుర్తును చూపిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



శంకర్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న అవినాశ్‌రెడ్డి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: కర్ణాటకలో ఇచ్చిన హామీలకే దిక్కు లేదని తెలంగాణలో కాంగ్రెస్ గుప్పిస్తున్న హామీలను ఇక్కడి జనం నమ్మే స్థితిలో లేరని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డిలు ఘాటుగా విమర్శించారు. శుక్రవారం అంతారం, కేసారం, కక్కులూర్, సర్దార్‌నగర్, కుర్వగూడ, బోడంపహాడ్, మన్మర్రి, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తరువాతనే తెలంగాణలో రూపు రేఖలు మారాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఎన్ని గంటల కరెంటు సరఫరా చేయించగలదో చెప్పే దమ్ముందా అన్ని వారు ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలో అమలుకాని పథకాలు తెలంగాణలో అమలు అవుతున్నాయన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, వెంకటయ్య, టీఎల్ఎఫ్ జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీశ్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, సర్పంచ్‌లు యాదమ్మ, సంధ్యారాణి శ్రీరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: చేవెళ్ల గడ్డపై యాదయ్య గెలుపు ఖాయమని మండల బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సింగాపురం, టవర్, ఆదర్శనగర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి కాలె యాదయ్యను మూడోసారి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి చెందిందన్నారు. కౌన్సిలర్లు చంద్రమౌళి, సంతోశ్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, గుడిమల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, పాల్గొన్నారు.

చేవెళ్ల ఎమ్మెల్యేకు నిరసన సెగ

- ఇరు పార్టీల నాయకుల మధ్య ఘర్షణ
- కాంగ్రెస్ నాయకులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు



ఎమ్మెల్యే కాలె యాదయ్యను నిలదీస్తున్న అంతారం గ్రామస్తులు

షాబాద్: ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ అభ్యర్థులకు పలుచోట్ల నిరసన సెగలు తగులుతున్నాయి. శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మండల పరిధిలోని అంతారం, కేసారం , బోడంపహాడ్ గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పలు గ్రామా ల్లో దళిత బంధు, ఇల్లు, పింఛన్‌లు తదితర విషయా లపై ప్రజలు ఆయన్ను నిలదీశారు. బోడంపహాడ్‌లో గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కాంగ్రెస్ నాయకులను పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ఎమ్మెల్యే ప్రచారం కొన సాగింది.

కెమికల్ పరిశ్రమ లాకర్‌లో గన్ లభ్యం

- మేకగూడలో కలకలం
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

నందిగామ: కార్మికుల లాకర్‌లో గన్ లభ్యమైన సంఘటన మేకగూడలో వెలుగులోకి వచ్చింది.

ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాట్కో కెమికల్ డివిజన్ పరిశ్రమలో గుంటూరు జిల్లాకు చెందిన ఆనంద్ 25 ఏళ్లనుంచి పనిచేస్తున్నాడు. పరిశ్రమలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన లాకర్‌లో డ్యూటీకి వెళ్లే ముందు తమ వస్తువులను అక్కడ భద్రపరుచుకుంటుంటారు. ఈ క్రమంలో ఓ లాకర్‌ను 15 రోజుల క్రితం ఆనంద్ తీసుకుని తాళం వేసుకున్నాడు. ఈ నెల 2వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడి డ్యూటీకి రావడంలేదు. శుక్రవారం లాకర్ ఉన్న గదికి, లాకర్లకు రంగులు వేసేక్రమంలో తాళం పగుల గొట్టారు. లాకర్‌లో గన్ చూసి ఒక్క సారిగా షాక్ అయ్యారు. ఈ విషయాన్ని వెంటనే పరిశ్రమ యాజమాన్యానికి, సిబ్బందికి తెలియజేశారు. దీంతో వారు ఈ విషయం గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గన్‌ను స్వాధీనం చేసుకొని ఆనంద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


యాచారం: నక్కర్తమేడిపల్లికి చెందిన జంగమ్మ(35) కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిదని సీఐ రామాంజనేయులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

సాధారణ ఎన్నికల పరిశీలకులు నినామా

ఇబ్రహీంపట్నం: ఎన్నికల సమస్యలపై ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ఫిర్యాదులు చేయవచ్చునని ఇబ్రహీంపట్నం సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆర్ఎస్ నినామా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో 29వ తేదీ వరకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులున్నా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. నేరుగా లేదా ఫోన్ ద్వారా సమస్యలను తెలుపవచ్చునన్నారు. 94260 18818 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కడ్తాల్‌లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కడ్తాల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కడ్తాల్‌లో స్థానిక ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారితో పాటు, ప్రధాన కాలనీల మీదుగా కవాతు నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సీఆర్పీఎఫ్, ఆర్మీ, పోలీసు బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అడవి పందుల బెడద

- ఆందోళనలో గ్రామస్తులు
- పంటను కాపాడాలని అధికారులకు మొర పెట్టుకుంటున్న రైతులు



కనకమామిడి సమీపంలో వరి పంటను రక్షించుకోవడం కోసం చేను చుట్టూ చీరలు కట్టిన రైతులు

మొయినాబాద్‌రూరల్: అడవి పందుల బెడద నుంచి పంటలను రక్షించుకోవడానికి రైతులు చేను చుట్టూ చీరలు కట్టి కాపాడుకుంటున్నారు. అధికారుల సూచనలు పాటించి తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. అధికారులిచ్చే సూచనలు పాటిస్తున్నా రాత్రి వేళల్లో అడవి పందుల బెడద మాత్రం తగ్గడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మండల పరిధిలో అధికంగా వరి సాగు, ఇతర పంటల సాగు చేశారు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో రైతులకు కంటి నిండా నిద్ర కరువైంది. అప్పులు చేసి పెట్టుబడులు పెడితే పంట చేతికొచ్చే సమయంలో పందులు వరి, ఇతర కూరగాయలు తింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కనకమామిడి, నక్కలపల్లి, చిన్నమంగళవారం, తోల్‌కట్ట, అమ్డాపూర్, కేతిరెడ్డిపల్లి, ముర్తుజాగూడ, బాకారం ఆయా గ్రామాల్లో రైతులు పండిస్తున్న పంటలు అడవి పందులతో పూర్తిగా దెబ్బ తింటున్నాయని వారు చెబుతున్నారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు పట్టించుకొని పందుల బెడదనుంచి తమ పంటలను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.